క్లుప్తంగా

ఉపాధిహామీపై సామాజిక తనిఖీ

బోథ్: బోథ్ మండలంలో 2024–2025 సంవత్సరంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో 15వ సామాజిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పనులోని లోపాలను వివరించారు. సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్లకు, అధికారులు జరిమానా విధించారు. పీడీ కుటుంబరావు, ఏపీడీ కృష్ణారావు, రాజేశ్వర్, ఎంపీడీవో రమేష్, ఉపాధిహామీ ఏపీవో జగదేరావు పాల్గొన్నారు.

బేల ఎస్సైగా ప్రవీణ్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై

బేల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సైగా ప్రవీణ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై మధుకృష్ణ సెలవులో వెళ్లడంతో, ఈస్థానంలో మావల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వరించిన ప్రవీణ్ బదిలీపై వచ్చారు. ఎస్సైకు, ఏఎస్సై కనక జీవన్‌కుమార్‌తో పాటు సిబ్బందిలు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

పేదలకు న్యాయ సలహాలు అందిస్తాం


జిల్లా జైలు వద్ద అధికారులు

తాంసి: పేదలకు న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అర్గుల అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా జైలును సందర్శించి ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒకరూ న్యాయ సహాయం పొందేందుకు 1987 సెక్షన్ 12 ప్రకారం చట్టం ఏర్పడిందన్నారు. జిల్లా ప్రజలకు న్యాయసేవలు అందించడానికి డిఫెన్స్ కౌన్సిల్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. డిప్యూటీ లాయర్ చంద్రకాంత్, డిప్యూటీ జైలర్ రాథోడ్ ప్రకాష్, తిలోత్తమ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మన్ నీలకంఠం ఉచితంగా బ్యాగులను, స్టడీ చైర్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు తూరటి గంగన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రాజేష్ అనే మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లినా.. తిరిగి రాలేదు. తండ్రి దేవన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగిపై ఎస్పీకి ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: డా.బాబాసాహెబ్ అంబేడ్కర్, భారత రాజ్యాంగాన్ని అవమానపరిచేలా సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఆర్టీసీ మెకానిక్ ఓం ప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ ఐక్య సంఘాల పోరాట కమిటీ నాయకులు కోరారు. శనివారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అల్లూరి భూమన్న, చందాల రాజన్న, సత్యవాన్ చిక్టే, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాపూరావు, నాయకులు

తలమడుగు: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. శనివారం మండలంలోని బరంపూర్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర రెడ్డి, ముడుపు మౌనిష్ రెడ్డి, దేవారెడ్డి, బొల్లారం బాబన్న పాల్గొన్నారు.

దండారీ సందడి


ఇంద్రవెల్లి: యేత్మసార్ దేవతలకు మొక్కుతున్న ఆదివాసీలు


ఇంద్రవెల్లి: కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే బొజ్జు


ఇంద్రవెల్లి: అతిథి మర్యాదలు చేస్తున్న డొంగర్‌గామ్ మహిళలు


ఇచ్చోడ: నృత్యం చేస్తున్న గుస్సాడీలు

ఇంద్రవెల్లి/ఇచ్చోడ/సాత్నాల/తలమడుగు: ఆయా మండలాల్లో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆదివాసీలు దండారీ బృందాలను తమ గ్రామానికి ఆహ్వానించి అతిథి మర్యాదలు చేశారు. ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి సిరికొండ మండలంలోని కన్నాపూర్ దండారీ బృందం, వాల్గొండ గ్రామానికి తుమ్మగూడ దండారీ బృందం అతిథులు వచ్చారు. అనంతరం ఎత్మసూర్ దేవతలకు గిరిజనులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. డొంగర్ గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. అలాగే తలమడుగు మండలంలోని ఉమ్రి గ్రామానికి మహారాష్ట్ర గోగర్‌వాడీ గ్రామం నుంచి దండారీ బృందం అతిథిగా వచ్చారు.


తలమడుగు: గోగర్‌వాడి గుస్సాడీలతో గ్రామస్తులు


తలమడుగు: ఉమ్రి గ్రామంలో..

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు


ఏర్పాట్లపై ఆరా తీస్తున్న తహసీల్దార్ రఘునాథ్‌రావు

బేల: పత్తి కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని మండల పర్యవేక్షక కమిటీ చైర్మన్, మండల తహసీల్దార్ రఘునాథ్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ జిన్నింగ్‌లో పత్తి కొనుగోళ్ల సన్నద్ధత ఏర్పాట్లపై పరిశీలించారు. 16 సీసీ కెమెరాలను బిగింపు పూర్తి చేయించామన్నారు. విద్యుదీకరణ, కాంటా తూకం, తాగునీరు, పరిశుభ్రత ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయించాలని జిన్నింగ్ యాజమానికి ఆదేశించారు.

జిన్నింగ్ మిల్లుల పరిశీలన

బోథ్: మండలంలోని జిన్నింగ్ మిల్లుల్లో రానున్న పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం తహసీల్దార్ సుభాష్ చందర్ సమక్షంలో అధికారుల బృందం పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి రవితేజ, ఏఎంసీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ విఠల్ స్వప్న జిన్నింగ్, రాఘవేంద్ర జిన్నింగ్, దత్తసాయి, సాయిబాబా జిన్నింగ్‌లకు వెళ్లి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

జైనథ్: మండల కేంద్రంలో పశువైద్యశాలలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఎఫ్ఎండీ ప్రోగ్రాం పర్యవేక్షణ అధికారి సచిన్ దేశపాండే హాజరయ్యారు. రైతులు పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, మండల పశుసంవర్ధక అధికారి వినోద్ దేశ్‌పాండే, పంచాయతీ కార్యదర్శి ముజీబ్ ఖాన్, రైతులు శివకుమార్, విలాస్, సునేరావు, ప్రవీణ్, వెంకన్న, సాయి కిరణ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని రాష్ట్ర వెటర్నరీ పరిశీలకుడు సచిన్ దేశ్‌పాండే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 14వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

క్రీడలతో స్నేహభావం

జైనథ్: క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై గౌతమ్ పవర్ అన్నారు. శ్రీ లక్ష్మీనారాయణ స్వామి జాతర సందర్భంగా శనివారం జైనథ్ ప్రైమరీ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచాయం చేసుకొని సరదాగా క్రికెట్ ఆడారు. గెలుపు ఓటములు సహజమని ప్రతిఒక్కరూ కలిసికట్టుగా క్రీడ పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు మారిశెట్టి గోవర్దన్, బీఆర్ఎస్ నాయకులు దేవన్న, గణేష్ యాదవ్, స్వామి యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రండి బాబు... రండి


వెలవెల బోతున్న ఎక్సైజ్ శాఖ కార్యాలయం


టెండర్‌దారులను పిలుస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

2025–27 సంవత్సరాలకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లాలోని మద్యం దుకాణాలు (వైన్స్)ల కేటాయింపునకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారం సాయంత్రం ఐదుగంటలతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. చివరి నిమిషంలో కార్యాలయంలో టెండర్లు వేసేందుకు వ్యాపారులేవరూ లేకపోవడంతో సమయం మించిపోతుంది రండి.బాబు రండి అంటూ ఎక్సైజ్ సిబ్బంది కార్యాలయ గేటు బయటకు వచ్చి మైక్‌లో అనౌన్స్ చేశారు. కాగా నిర్ణీత గడువు దాటినప్పటికి తమ శాఖకు ఆదాయం వచ్చేందుకే కదా అంటూ ఎక్సైజ్ అధికారులు వ్యాపారులను లోపలకు అనుమతించడం గమనార్హం. కాగా లైసెన్స్ ఫీజు రూ.3లక్షలకు పెంచడం, రెండేళ్ల గడువే ఉండటంతో దరఖాస్తుదారుల సంఖ్య తగ్గినట్లుగా తెలుస్తోంది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బీసీ బంద్ ప్రశాంతం


కైలాస్‌నగర్: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


బజార్‌హత్నూర్: రాస్తారోకో చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని రాజకీయ పార్టీలు, ఆయా సంఘాల నాయకుల పిలుపు మేరకు శనివారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించి, వ్యాపార సముదాయాలు, హోటళ్లను నాయకులు మూసివేయించారు. ఉట్నూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. అసెంబ్లీ సాక్షిగా బీసీ బిల్లు ప్రవేశపెట్టి గవర్నర్ ఆమోదం కోసం పంపిస్తే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి కుట్రలు చేసి పెండింగ్‌లో ఉంచాయన్నారు. జిల్లా కేంద్రం కైలాసనగర్‌లోని ప్రజాసేవభవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమతమయ్యాయి.


తాంసి: దుకాణం బంద్ చేయిస్తున్న నాయకులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి


పరిశీలిస్తున్న జాదవ్ దేవిదాస్

నార్నూర్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి జాదవ్ దేవిదాస్ అన్నారు. శనివారం మండలంలోని నాగల్‌కొండ, గుంజాల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలను ఆయన సందర్శించారు. రోగుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రతీ రోజు చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందిచాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

సాత్నాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ సునంద అన్నారు. భోరజ్ మండలం బాలాపూర్ గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాలలో పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతం చేశారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం కానున్నట్లు మండల బీఆర్ఎస్ కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

చదువులో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులు చదువులో రాణించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో జైనూర్ మండలంలోని గిరిజన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందించారు. ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన మెస్రం జగన్ కుమార్‌కు ప్రోత్సాహకంగా ల్యాప్‌ట్యాప్ అందించడం జరిగిందన్నారు.

ఆయుర్వేదానికి ఆదరణ పెరిగింది

ఆదిలాబాద్: కరోనా మహమ్మరీ విజృంభన తరువాత ఆయుర్వేదానికి ఎంతో ఆదరణ పెరిగిందని తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు జనగం సంతోష్ అన్నారు. శనివారం దంతేరాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు యువరాజ్ వైద్యను సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సీసీఐ సమీపంలోనీ ఆయన నివాసంలో చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు కలిసి దంతేరాస్ శుభాకాంక్షలు తెలిపి వైద్య దంపతులను సన్మానించారు. జగదీష్ అగర్వాల్, దుర్గం రాజేశ్వర్, సిడం రాంకిషన్, పంకజ్ దేశ్ పాండే పాల్గొన్నారు.

పంటచేలకు వెళ్లేదెలా?


రోడ్డు కొట్టుకుపోవడంతో ఏర్పడిన గుంత

- కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- వంతెన నిర్మించాలని వేడుకోలు

తాంసి: ఆరుగాలం పండించిన పంట గిట్టుబాటు ధర వస్తుందో? రాదో? తెలియని పరిస్థితి. దిగుబడి వచ్చినా.. పంటను ఇంటికి తెచ్చుకునేందుకు మండలంలోని వడ్డాడి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని వడ్డాడి ప్రాజెక్టు దిగువన దాదాపుగా 1000 ఎకరాలకు పైగా సాగుభూమి ఉంది. సాగుచేసిన పత్తి, సోయా పంటలు ఇంటికి తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు గేట్ల కింద దిగువ ఉన్న తాత్కాలిక రహదారి ఈఏడాది కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దిగుబడులు తీసుకెళ్లేందుకు దిగులు చెందుతున్నారు. మత్తడివాగు ప్రాజెక్టు కట్టపై నుంచి చుట్టూ తిరిగి తీసుకెళ్లాల్సి రావడంతో దూరభారం పెరుగుతుంది. కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారిని బాగు చేసుకునేందుకు రైతులు తలకొంత డబ్బులు పోగు చేసి ముందుకు వస్తున్నారు.

వడ్డాడి వాగు దాటితేనే..

మత్తడివాగు ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న వడ్డాడి వాగు దాటితేనే పంట చేలకు వెళ్లే అవకాశం ఉంది. సరైన మార్గం లేక ప్రతీ ఏటా వాగు దాటి వెళ్తున్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టులోకి వరదనీరు చేరి గేట్లను ఎత్తి నీటిని వదిలితే వరద ప్రవహం ఎక్కువగా ప్రవహిస్తోంది. ఆ సమయంలో రైతులు చేలకు వెళ్లాలంటే ప్రాజెక్టు కట్టపై నుంచి తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో రైతులకు, కూలీలకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని నిర్మాంచాలని ప్రజలు కోరుతున్నారు.

కట్టపై నుంచి వెళ్తున్నాం



ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రోడ్డు భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రోడ్డు కోతకు గురవడంతో రాకపోకలు సాగడం లేదు. ప్రస్తుతం పంటచేలకు ప్రాజెక్టు కట్టపై నుంచి వెళ్తున్నాం. వాగులో నుంచి ఎడ్లబండ్లు సైతం వెళ్లకుండా కోతకు గురైంది. తాత్కాలిక రోడ్డు నిర్మాణం కోసం చందాలు వేసుకున్నాం.

– కేమ పొచ్చన్న, రైతు, వడ్డాడి

వంతెన నిర్మించాలి



ప్రాజెక్టు దిగువన వాగుపై వంతెన నిర్మాణం చేపడితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రతీ ఏటా తాత్కాలికంగా రోడ్డు వేసి పైపులు వేసినా.. రహదారి కొట్టుకుపోతుంది. శాశ్వత పరిష్కారంగా దిశగా వాగుపై వంతెన నిర్మిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– గిజ్జ రామన్న, రైతు, వడ్డాడి

సంక్షిప్తం..

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

సాత్నాల: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భోరజ్ మండలంలోని కేదార్‌పూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. గుట్కా, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాలు శరీరాన్నితో పాటు కుటుంబాలని నాశనం చేస్తాయన్నారు. ఎస్సై గౌతమ్ పవర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు రోడ్లు మంజూరు

బోథ్: మండలంలోని మూడు గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. జెడ్పీ రోడ్డు నుంచి అందూర్ మీదుగా నారాయణపూర్ వరకు 2.3 కిలోమీటర్లు, జెడ్పీ రోడ్డు నుంచి రేండ్లపల్లె గ్రామం వరకు 3.8 కిలో మీటర్లు, పీడబ్ల్యూ రోడ్డు నుంచి బిర్లాగొంది గ్రామానికి 0.65 కిలోమీటర్ల రోడ్లు మంజూరైనట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

బోథ్: కనుగుట్ట గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామ యువకులు శనివారం బోథ్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రావణ్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఏఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌కు సన్మానం

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ యాజ్ కేస్ ఛాలెంజ్‌లో ఇటీవల నాలుగు పురస్కారాలను అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను మాదిగ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో చందాల రాజన్న, నక్క రాందాస్, మల్యాల మనోజ్, దర్శనాల అశోక్, లింగంపల్లి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాల ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

తలమడుగు: కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు త్వరగా కోలుకోలుకోవాలని శనివారం బరంపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తుల పాల్గొన్నారు

'బీజేపీ, బీఆర్ఎస్ నేతలు బీసీ ద్రోహులు'

నేరడిగొండ: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ ద్రోహి పార్టీలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మండిపడ్డారు. శనివారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పిలుపు మేరకు నేరడిగొండ మండల కేంద్రంలో నాయకులతో కలిసి బంద్‌కు మద్దతుగా పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువులు సాధించాలి

ఆదిలాబాద్: ఆర్యవైశ్యులు ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్తవార్ రాజేశ్వర్ అన్నారు. ఇటీవల గ్రూప్ 1లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎంపికై న జనగం నందినిని శనివారం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సన్మానించారు.

'కంది'ని కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కై లాస్‌నగర్: లారీ యజమానుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ప్రజాసేవాభవన్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు ఫహీం ఖాద్రి, సందీప్, నయీముద్దీన్, అక్బర్ షరీఫ్, సయ్యద్ సిరాజ్, మోహిసిన్ అహ్మద్ పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాల్లో గజేందర్

నేరడిగొండ: మండలంలోని యాపాల్‌గూడ, రోల్‌మామడ గ్రామంలో శనివారం నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన ఆదివాసీలతో కలిసి గుస్సాడీ నృత్యం చేశారు. నాయకులు ఆడే వసంత్ రావు, మందుల రమేశ్, తిత్రే నారాయణ్ సింగ్, బద్దం పోతారెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, మునీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎకో బజార్

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణంతో పాటు పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించేదుకే ఎకో‌బజార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. శనివారం విద్యార్థులు మట్టి, కాగితం, జూట్, కాటన్ వంటి వాటితో వివిధ రకాల వస్తువులను తయారుచేసి ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు చేపట్టారు. ఎకో క్లబ్ కోఆర్డినేటర్ ఎండీ అష్రాఫ్, అధ్యాపకులు అరుణ్ కుమార్, శ్రావణి, శ్రీధర, మంజుల, చక్రవర్తి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో అన్నదాత రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. సోయాకు ప్రైవేట్‌లో ధర లేకపోవడంతో రైతు సంఘాల ద్వారా అమ్మితే రైతులు లాభం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తుడిచేర్ల బాలాజీ, ప్రశాంత్, సలీం, ఆనందరావు, రైతులు కేశవ్, ప్రకాశ్, ఆనంద్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899